సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 4 । జనవరి । 2025



● అబ్బురం అరుణోదయం

పాడేరు పట్టణానికి సమీపంలోని జాయింట్ కలెక్టర్ బంగ్లా ప్రాంతంలో శుక్రవారం వేకువజామున అరుణోదయం అందాలు చూపరులను ఎంతగానో అబ్బురపరిచాయి. పర్యాటకులతో పాటు ప్రకృతి ప్రేమికులు ఈ అపురూప దృశ్యాలను కెమెరాల్లో బంధించి పదిల పరచుకున్నారు.

– సాక్షి, పాడేరు

ఇక్కడంతా నీడలే మాట్లాడతాయి...!

షాడోలే అసలైన హీరోలు



- ఎమ్మెల్యే కలెక్షన్ కింగ్‌లంతా వీరే...
- కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రధాన అనుచరులదే హవా
- ఏ పని కావాలన్నా వీరు తలూపాల్సిందే...
- పోస్టింగుల నుంచి పైరవీలదాకా అంతా వీరి కన్నుసన్నల్లోనే...

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: **కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేల నడకను నీడలే** శాసిస్తున్నాయి. ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి ఏ పని చేయాలో...ఏ పోస్టుకు ఎవరిని సిఫారసు చేయాలో.. ఏ పని ఎవరికి అప్పగించాలో అంతా వీరే నిర్ణయిస్తున్నారు. నీడను కూడా నమ్మకూడదనేది పాత సామెత. అంతా నీడను నమ్మి... వారు చెప్పినట్టే చేయాలనేది కూటమి ఎమ్మెల్యేల బాట. కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేల్లో ఎవరి దారి వారిదే. ఒకరు సొంత కుటుంబ సభ్యులను షాడోలుగా పెట్టుకుని పనులు నడుపుతుంటే... మరొకరు బంధువులు, ప్రధాన అనుచరులతో పనులు కానిస్తున్నారు. తమ చేతికి నేరుగా మట్టి అంటుకోకుండా అవినీతి వ్యవహారాలను గుట్టుగా చక్కబెడుతున్నారు. కొద్ది మంది ఎమ్మెల్యేలకు ఏకంగా ఐదు నుంచి పది మంది వరకూ షాడోలుగా వ్యవహరిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. కొందరు కేవలం సొంత కుటుంబ సభ్యులతో మాత్రమే పనులు చక్కబెట్టుకుంటున్నారు. మరి కొందరు తమ ప్రధాన అనుచరులను నమ్ముకుని జేబులు నింపుకుంటుండగా.... ఆరోపణలు వచ్చిన వెంటనే తనకు తెలియకుండా చేశాడని అధిష్టానానికి వివరణ ఇస్తూ పక్కన పెట్టినట్టు నటిస్తున్నారు. మొత్తంగా కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేల్లో మెజారిటీ సభ్యుల నీడలే వ్యవహారాలన్నీ నడుపుతుండటం గమనార్హం.

పెత్తనమంతా వారిదే...!

విశాఖ జిల్లాలోని ఒక్కో ఎమ్మెల్యేది ఒక్కో తీరు. కూటమిలోని ఒక ఎమ్మెల్యే పైకి నిజాయితీపరుడిగా నటిస్తూ.... వ్యవహారాలను మాత్రం ఆయన కుటుంబ సభ్యుల ద్వారా కానిస్తున్నారు. ఆయన లేని సమయంలో ఆయన కుటుంబంలోని వ్యక్తి ప్రారంభోత్సవాలు, సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఇక పలు మార్లు ఎమ్మెల్యేగా గెలిచి... నియోజకవర్గమంతా కొట్టినపిండి మాదిరిగా ఉన్నప్పటికీ... ఆయన లేని సమయంలో ఆయన అనుచరుడు అధికారులపై కేకలు వేస్తూ పనిచేస్తున్నారు. అధిష్టానం నుంచి ఆయనపై ఏ మాత్రం సానుకూల దృక్పథం లేకపోవడంతో దూకుడు తగ్గించిన సదరు ఎమ్మెల్యే.... ఆయన షాడో మాత్రం ఎక్కడా తగ్గేదేలే అంటూ దబాయించి మరీ పనులు చేయిస్తుండటం గమనార్హం. ఇక నగరంలో కూటమిలోని ఓ ఎమ్మెల్యే మాత్రం అంతా పెదరాయుడు టు ధనుష్... ధనుష్ టు పెదరాయుడు అన్నట్టుగా నేరుగా వ్యవహారాలను చక్కబెట్టుకుంటున్నారు. ఎప్పుడూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండడనే పేరున్న ఓ ఎమ్మెల్యేకు కుటుంబంలోని ఐదు మంది షాడోలుగా వ్యవహరిస్తున్నారు. సతీమణి, కుమారుడు, అల్లుడు, మేనల్లుడు, బావమరిదితో పెత్తనమంతా సాగుతుండటం ఆయన వద్దకు వచ్చే అందరికీ తెలిసిన విషయమే. మంత్రి పదవి ఆశిస్తున్న మరో ఎమ్మెల్యేకు మాత్రం పోలీసు పోస్టింగుల్లో భార్య తరపు బంధువు (బావమరిది) ఒకరు భారీగా దండుకోవడంతో విమర్శలు వచ్చాయి. దీంతో తాత్కాలికంగా పక్కన పెట్టినట్టు ప్రచారం చేశారు. వసూళ్లన్నీ ఎమ్మెల్యే జేబులోకి చేరడంతో నియోజకవర్గంలో కనపడకుండా... కేవలం ఇంటికి మాత్రమే వచ్చేలా చూసుకుంటున్నారు. ఇక జీవీఎంసీలోని వ్యవహారాలన్నీ ఇద్దరు కార్పొరేటర్ల ద్వారా ఆయన చూసుకుంటున్నట్టు తెలుస్తోంది.

మండలానికి ఒకరు...!

అనకాపల్లి జిల్లాలోనూ ఎమ్మెల్యేలదీ ఒక్కొక్కరిది ఒక్కో స్టైయిల్. ఇప్పటికే జనసేన అధిష్టానం నుంచి భారీగా విమర్శలు ఎదుర్కొని క్లాసులు పీకుతున్నా.... అస్సలు తగ్గేదేలే అని ఆయన రెచ్చిపోతున్నారు. ఆయన అవినీతి దూకుడుకు ఎవ్వరూ ఆనడం లేదు. ఆయన సోదరుడి అండతో అందినకాడికి దోచుకుంటున్నారు. పరిశ్రమల నుంచి పోస్టింగుల వరకూ... నేవీ నుంచి నరేగా నిధుల వరకూ ఆయనకు అడ్డులేకుండా పోయింది. ఇక మరో ఎమ్మెల్యే నియోజకవర్గంలోని మండలానికో వ్యక్తిని షాడోగా మార్చుకున్నారు. అక్కడ కొత్తగా వెంచర్ వేయాలన్నా.... నిర్మాణాలు చేపట్టాలన్నా వీరి నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. ఈయనకు నియోజకవర్గమంతా మొత్త 10 మంది వరకూ షాడోలుగా వ్యవహరిస్తున్నారు. మరో ఎమ్మెల్యే వ్యవహారాలన్నీ సతీమణితో పాటు కుమారులు చూసుకుంటుండగా... ఇంకో ఎమ్మెల్యే పెత్తనమంతా కుమారుడే దగ్గరుండీ మరీ చక్కబెడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటికీ నుంచి పెద్దగా ఎక్కడా హడావుడి చేయకపోయినప్పటికీ సదరు ఎమ్మెల్యే అల్లుడు మాత్రం ఆర్థిక వ్యవహారాల్లో చక్రం తిప్పుతున్నారు. ఇదే జిల్లాలోని ఒకరు మాత్రం నిత్యం వార్తల్లో ఉంటున్నారు. సదరు ఎమ్మెల్యే అనుచరులు ఇప్పటికే భూకబ్జాలు, పోస్టింగుల్లో భారీగా వసూళ్లకు తెగబడటంతో అధిష్టానం దాకా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో అప్పటివరకు అన్ని వ్యవహారాలను చక్కబెట్టిన సదరు వ్యక్తి తనకు తెలియకుండా చేశాడంటూ దూరం పెడుతున్నట్టు సర్దిచెప్పుకున్నారు. ఈ ఎమ్మెల్యేకు నియోజకవర్గంలోని మండలానికి ఇద్దరు ముగ్గురు షాడోలుగా రెచ్చిపోతున్నారు.

ఎమ్మెల్యే భర్తదే పెత్తనం

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఒక నియోజకవర్గంలో ఎమ్మెల్యే భర్తదే మొత్తం పెత్తనమంతా నడుస్తోంది. ఏ పోస్టింగు కావాలన్నా... ఆయన ఓకే అనాల్సిందే. ఇప్పటికే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు వ్యక్తి... ఎన్ని ఆరోపణలు వచ్చినా ముందుకేనంటూ నీడగా సాగుతున్నారు. ఒక నియోజకవర్గ ఇంచార్జీకి గతంలో పీఏగా వ్యవహరించిన వ్యక్తి ఇప్పటికీ వెనుక నుంచి కథ మొత్తం నడిపిస్తున్నట్టు విమర్శలున్నాయి.

న్యూస్‌రీల్

చింతపల్లిలో పెరిగిన చలి తీవ్రత



చింతపల్లి మండలం అంతర్ల సమీపంలో కురుస్తున్న పొగమంచు

చింతపల్లి: కనిష్ట ఉష్ణోగ్రతలు **రోజు రోజుకు తగ్గ**ముఖం పడుతుండటంతో **చలి తీవ్రతకు మన్యం** వాసులు వణికిపోతున్నారు.**ఈ ప్రాంతంలో గత** మూడు రోజులుగా పగటి **ఉష్ణోగ్రతల్లో మార్పుతో** చల్లటి గాలులు వీస్తున్నాయి. చింతప**ల్లి ప్రాంతం**లో శుక్రవారం ఒక్క సారిగా ఉష్ణోగ్రతలు తగ్గి 7.1 డిగ్రీలు నమోదు అయినట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. దీంతో ఉదయం వేళలో మంచు తీవ్రంగా కురిసింది. పెద్దలు, చిన్నారులు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు.

శిశు ఆధార్ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోండి

- కలెక్టర్ దినేష్‌కుమార్



శిశు ఆధార్ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో విరించి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న శిశు ఆధార్ కేంద్రాల సేవలను తల్లిదండ్రులందరు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో ఇందుకు సంబంధించిన ప్రచార బ్యానర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సున్నా నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు కోసం ఈ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పిల్లల ఆధార్‌ను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు.అన్ని ప్రాంతీయ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో శిశు ఆధార్ కేంద్రాల సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, విరించి సంస్థ ప్రతినిధులు మూర్త శ్రీను, గూడపల్లి ప్రదీప్‌కుమార్, ఉప్పు నాగేశ్వరరావు, శిశు ఆధార్ కో ఆర్డినేటర్ బీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యమైన ఉత్పత్తులు

- చింతపల్లి ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ అప్పలస్వామి



చింతపల్లి పరిశోధన స్థానంలో క్షేత్ర ప్రదర్శన నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

చింతపల్లి: సేంద్రియ వ్యవసాయంపై అవగాహనతోనే భావితరాలకు మంచి ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించే అవకాశం ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. పరిశోధన స్థానంలో సేంద్రియ సాగుకు సంబంధించి వారం రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు క్షేత్ర స్థాయి ప్రదర్శన నిర్వహించారు. గ్రామీణ యువతకు వివిధ పంటల్లో పోషక లోపాలు నివారణ, డిజిటల్ మార్కెటింగ్, సేంద్రియ విధానంలో పురుగుల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు బాల హుస్సేన్‌రెడ్డి, బయ్యపురెడ్డి సందీప్ నాయక్, జోగారావు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా నందనవనం



కొత్తపల్లి జలపాతం వద్ద గార్డెన్

జి.మాడుగుల: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కొత్తపల్లి జలపాతం వద్ద కొత్తగా వివిధ మొక్కలతో ఏర్పాటు చేసిన గార్డెన్ అందాలు కనువిందు చేస్తున్నాయి. జలపాతం సమీపంలో సుందరీకరణ పనుల్లో భాగంగా గార్డెన్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. జలపాతం వద్దకు వస్తున్న పర్యాటకులను ఈ అందాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

సమస్యలు పరిష్కరించాలి

- గ్రామ వలంటీర్ల డిమాండ్
- రంపచోడవరంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



రిలే నిరాహార దీక్షలు చేపట్టిన గ్రామ వలంటీర్లు

రంపచోడవరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐటీడీఏ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ వలంటీర్లు శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వీటిని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం గ్రామ వాలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వలంటీర్ల జిల్లా కార్యదర్శి సవలం సుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు కుంజం భానుప్రియ. ఎం.కామేశ్వరి, జే దేవి పాల్గొన్నారు.

మైనర్లకు హోటల్ గదులు కేటాయించొద్దు

- ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాలు
- అతిక్రమిస్తే కఠిన చర్యలు

పాడేరు : పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో ఉన్న పర్యాటక ప్రాంతాల్లో హోటళ్లు, రిసార్ట్‌లు, కాటేజీల యజమానులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ఆయా చోట్ల మైనర్ బాలబాలికలకు గదులను కేటాయించవద్దని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో బాల, బాలికలకు తరచుగా గదులు కేటాయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మైనర్లకు గదులు కేటాయించడం చట్టరీత్యా తీవ్ర నేరమన్నారు. ఇకపై మైనర్లకు గదులు కేటాయించినట్లు తమ దృష్టికి వస్తే సంబంధిత హోటల్ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి వచ్చిన, ఒంటరిగా వచ్చిన కూడా ఏజెన్సీలో హోటల్ గదులు కేటాయించవద్దన్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో వస్తే మాత్రం పూర్తి వివరాలు సేకరించిన తర్వాత మాత్రమే గదులు కేటాయించాలని సూచించారు. హోటల్ గదులు కేటాయించే ముందు ఆధార్ కార్డు ఆధారంగా వారి వివరాలు సరిచూసుకోవాలన్నారు. బాల,బాలికలకు, మైనర్లకు హోటల్ గదులు లేవని నోటీసులు బోర్డుల్లో పొందుపర్చాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

పర్యాటక ప్రాంతాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని పర్యాటక ప్రాంతాల్లో అవసరమైన సౌకర్యాలను గుర్తించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయం నుంచి పర్యాటక అభివృద్ధిపై అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల్లో ఎంట్రీ, స్టాళ్లకు సంబంధించి పర్యాటకుల నుంచి ఫీజులు వసూలుపై తనకు నివేదిక అందజేయాలన్నారు. పంచాయతీరాజ్, ఐటీడీఏ, పంచాయతీలు, రెవెన్యూ సంఘాలు చేస్తున్న ఫీజుల వసూళ్లు మొత్తం క్రెడిట్ అవుతున్న ఖాతాలు, వారు కల్పిస్తున్న లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సేవల సమగ్ర వివరాల నివేదికలు అందించాలని సూచించారు. వాటిని నెల రోజుల్లోగా క్రమబద్ధీకరించాలని ఆదేశించారు.

'చలి అరకు ఉత్సవ్' ఏర్పాట్లు వేగవంతం

చలి అరకు ఉత్సవ్‌కు సంబంధించి ఏర్పాట్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అరకులోయలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న అరకు ఉత్సవ్‌కు వివిధ రాష్ట్రాల నుంచి గిరిజన కళాకారులను రప్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మణిపూర్, ఒడిశా,తెలంగాణ, పాండిచ్చేరి తదితర రాష్ట్రాల నుంచి గిరిజన సంప్రదాయ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మారథాన్, కార్నివాల్‌తో పాటు బొర్రాగుహల నుంచి అరకులోయ వేదిక వరకు ప్రొఫెషనల్స్‌తో సైక్లింగ్, మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. అరకు ఉత్సవ్ బ్లాగ్ ఏర్పాటు చేసి ప్రోమోతో పాటు ఎప్పటికప్పుడు కార్యక్రమాలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈవెంట్లకు సంబంధించి క్యూ ఆర్ కోడ్ ఏర్పాటుతో పాటు ప్రోమో ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. కళారూపాలన్ని వారి సంప్రదాయ డ్రెస్‌లలోనే ఉండాలని, ఫుడ్‌కోర్టులు, అమ్యూజ్‌మెంట్, టూరిజం బ్రోచర్లు, ట్రైబల్ ఫ్యాషన్‌షో, యోగ, హాట్ ఎయిర్‌బెలూన్, పారా మోటరింగ్ లాంటి సాహస క్రీడలు ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవానికి వచ్చే అతిథులులకు వసతి, భోజనం, రవాణాతో పాటు జ్ఞాపికలు అంశాలపై దృష్టిసారించి, ఇందుకు సంబంధించి నివేదికలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయం నుంచి జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ, పాడేరు సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, డీఆర్వో పద్మలత, వర్చువల్ విధానంలో రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, టూరిజం డివిజనల్ మేనేజర్ జగదీశ్వరరావు, అల్లూరి సీతారామరాజు స్మారక మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ శంకరరావు, జిల్లా టూరిజం అధికారి జి.దాసు, గిరిజన మ్యూజియం క్యూరేటర్ మురళి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం
- మీకోసం కార్యక్రమానికి గైర్హాజరైతే షోకాజ్ జారీ చేస్తామని హెచ్చరిక



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్వో పద్మాలతతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 52 వినతులను స్వీకరించారు. పలువురు జిల్లా స్థాయి అధికారులు మీకోసం కార్యక్రమానికి హాజరు కాలేదని గుర్తించిన కలెక్టర్ వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు అనుమతి లేకుండా మీ కోసం కార్యక్రమానికి గైర్హాజరైతే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. పదేపదే వస్తునన ఫిర్యాదులపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ కొండయ్యపడాల్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమేష్‌కుమార్‌రావు, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఐటీడీఏ ఏవో హేమలత, ఆర్ డబ్ల్యూఎస్ ఈఈ జవహార్‌కుమార్, జిల్లా ఖజానాధికారి ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

నేవీడే విన్యాసాలు
- వేడుకలకు సర్వం సిద్ధం
- బీచ్‌రోడ్డులో ప్రత్యేక భద్రత

IIలో

పాఠశాలల అభివృద్ధిలో కమిటీలు కీలకం

ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు



మాట్లాడుతున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

అడ్డతీగల: పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీల (ఎస్ఎంసీలు) పాత్ర కీలకమని ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో శుక్రవారం పాఠశాల యాజమాన్య కమిటీల చైర్మన్లకు కమిటీల విధులు, బాధ్యతలు అనే అంశాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే యాజమాన్య కమిటీలు నిత్య పర్యవేక్షణతో వారి పనితీరు మెరుగుపర్చుకున్నప్పుడే సాధ్యమౌతుందన్నారు. చైర్‌పర్సన్లు ఉపాధ్యాయులకు సహాయ సహకారాలు అందిస్తూ పాఠశాలల అభివృద్ధికి బాటలు వెయ్యాలన్నారు. ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఆయన తెలుసుకున్నారు. పలు సమస్యలను ఆయన దృష్టికి వారు తీసుకువచ్చారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పలు అంశాలను వివరించారు. ఎంఈవో-2 పి.శ్రీనివాసరావు, డీఆర్పీలు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

రంపచోడవరం : చౌకధరల డీపో డీలర్ల నియామానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆమె శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. రంపచోడవరం డివిజన్‌లో పలు మండలాల్లో 34 చౌకధరల డిపోలకు డీలర్ల నియామానికి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ఆయా మండలాల్లో తహసీల్దార్లను సంప్రదించి ఖాళీ ఉన్న వాటికి ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 10వ తేదీలోగా అందజేయాలని ఆమె కోరారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు 35 శాతం జీతాల చెల్లింపు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఉద్యోగులకు నవంబర్ నెలకు సంబంధించి శుక్రవారం కేవలం 35 శాతం జీతం చెల్లించింది. సంక్రాంతి పండగ నేపథ్యంలో కేవలం 35 శాతం జీతం చెల్లించడంపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సెప్టెంబర్ జీతం 50 శాతం, అక్టోబర్ జీతం 35 శాతం, నవంబర్ పూర్తి జీతం పెండింగ్ పెట్టింది. డిసెంబర్ నెల పూర్తి జీతంతో మొత్తం 285 శాతం జీతం పెండింగ్‌లో పెట్టింది. నవంబర్ నెలకు సంబంధించి కేవలం 35 శాతం ఇవ్వడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోరంలేని చోట్ల పీసా కమిటీ ఎన్నికలు వాయిదా

- ఈ నెల 6 లేదా 8న నిర్వహించే ఆలోచనలో అధికారులు
- ఒక వర్గానికి అనుకూలంగా పనిచేస్తున్నారని డౌనూరులో ఉపాధ్యాయుడిపై పీవోకు ఫిర్యాదు



చింతపల్లిలో గెలుపు పత్రం అందుకుంటున్న వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి పంతులుబాబు



రాజేంద్రపాలెంలో ఎన్నిక వాయిదా పడడంతో వెళ్లిపోతున్న ఓటర్లు



కొయ్యూరు మండలంలో ఎన్నికల వాయిదాను ప్రకటిస్తున్న ఎంపీడీవో,ఎన్నికల అధికారి

కొయ్యూరు: పీసా కమిటీ ఎన్నికలు కోరం లేక చాలా చోట్ల వాయిదా పడ్డాయి. గతంలో జరిగిన వాటికి భిన్నంగా ఇప్పుడు ఎన్నికలు నిర్వహించడంతో కోరం సరిపోవడం లేదు. దీంతో ఎన్నికల అధికారులు వాటిని వాయిదా వేశారు. తిరిగి వీటిలో కొన్నింటిని ఈ నెల ఆరున లేదా ఎనిమిదిన నిర్వహించాలని చూస్తున్నారు. మండలంలో శుక్రవారం 38 కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. వీటిలో కోరం లేక 12 చోట్ల వాయిదా పడ్డాయి. మండల కేంద్రం రాజేంద్రపాలెంలో ఎన్నిక కూడా వాయిదా పడింది. ఇక్కడ 1,200 మంది ఓటర్లకు 283 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేక వాయిదా వేస్తునట్టు ఎంపీడీవో ప్రసాద్, ఎన్నికల అధికారి పరిమళ ప్రకటించారు. డౌనూరులో ఓటింగ్ జరగనీయకుండా అడ్డుకోవడంతో పూర్తి కావచ్చిన ఎన్నికల ప్రక్రియ ఆగిపోయింది. డౌనూరులో ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరించారని ఓ ఉపాధ్యాయుడిపై పాడేరు ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేసినట్టు స్థానికులు తెలిపారు.

గంగవరం : గ్రామాల్లో జరుగుతున్న పీసా గ్రామసభ ఉపాధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలు కోరం లేక వాయిదా పడుతున్నాయి. శుక్రవారం గంగవరం, ఎండపల్లి గ్రామాల్లో పీసా ఎన్నికలు వాయిదా వేసినట్లు ఎంపీడీవో పీజీ రామకృష్ణ తెలిపారు. కోరంలేని కారణంగా, ఎన్నికల నియమావళిని అనుసరించి వాయిదా వేశామని గంగవరం ఎన్నికల అధికారి కె. విశ్వనాథ్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ సభ ఎప్పుడు అనేది నోటీసు, దండోరా ద్వారా తెలియచేస్తామని ఆయన పేర్కొన్నారు.

చింతపల్లిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు ఏకగ్రీవంగా ఎన్నిక

చింతపల్లి: మండల కేంద్రంలో జరిగిన రెండు ఎన్నికల్లో ఒకచోట వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి పంతులుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరొక స్థానంలో పోటీకి వైఎస్సార్‌సీపీ దూరంగా ఉండటంతో కూటమి నాయకుల కుమ్ములాటల మధ్య జరిగింది. మండలంలో 30 ప్రాంతాల్లో ఎన్నికలు జరగాల్సి ఉండగా 23 చోట్ల మాత్రమే జరిగాయి. వీటిలో 13 చోట్ల ఏకగ్రీవం కాగా మరో 7చోట్ల వాయిదా పడ్డాయి. వీటిలో పెదబరడ, చౌడుపల్లి, కిటుములు, గొండిపాకలు, కొమ్మంగి, అంజలిశనివారంతో పాటు రోలంగి వాయిదా పడ్డాయని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. వీటికి ఈ నెల 7వ తేదీ అనంతరం ఎన్నికల తేదీలను ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

ట్రేడ్ అప్రెంటిస్‌షిప్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: 2024–25 సంవత్సరానికి ట్రేడ్ అప్రెంటిస్‌షిప్‌ల కోసం అర్హులైన ఐటీఐ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ తదితర ట్రేడ్‌ల్లో మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాల్లో అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి ట్రేడ్‌కు ఏడాది కాలం పాటు శిక్షణ ఉంటుందని, ఎంపికై న అభ్యర్థులకు నెలకు రూ. 8,344.60 నుంచి రూ. 9,387.67 వరకు స్టైఫండ్ చెల్లిస్తామన్నారు. 2024 డిసెంబర్ 31 నాటికి 14 ఏళ్లు నిండిన ఐటీఐ అభ్యర్థులు అర్హులని, ఆసక్తి ఉన్నవారు https://www. apprenticeshipindia. gov. in ద్వారా ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యే అభ్యర్థులకు విశాఖ పోర్ట్ అథారిటీ ఎలాంటి టీఏ, డీఏ చెల్లించదని చైర్మన్ స్పష్టం చేశారు. ఎస్టీ, ఎస్సీ, ఓబీసీ అభ్యర్థులకు నిబంధనల ప్రకారం రిజర్వేషన్ వర్తిస్తుందని వెల్లడించారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగాల పేరుతో మోసం

- తండ్రీ కొడుకులకు జైలు, జరిమానా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసగించిన కేసులో తండ్రీకొడుకులకు న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు. ఒకేసారి ఐదు కేసుల్లో శిక్ష పడటం చాలా అరుదు అని స్టీల్‌ప్లాంట్ సీఐ కేశవరావు తెలిపారు. కలపాకకు చెందిన స్టీల్‌ప్లాంట్ విశ్రాంతి ఉద్యోగి నగిరెడ్డి పోతయ్య, ఆయన కుమారుడు వెంకటరమణ(కాంట్రాక్ట్ కార్మికుడు) ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి దాదాపు 50 మంది నుంచి రూ.63 లక్షలు వసూలు చేశారు. ఉద్యోగాలు రాకపోవడంతో మోసపోయామని బాధితులు గ్రహించి.. 2017లో స్టీల్ ప్లాంట్ పోలీస్‌స్టేషన్‌లో తండ్రీకొడుకులపై ఫిర్యాదు చేశారు. గాజువాక అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వై.శ్రీలక్ష్మి 50 మంది సాక్షులను విచారించి తండ్రీకొడుకులిద్దరికీ మూడేళ్ల జైలు శిక్ష, ఒక్కో కేసులో రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్.. నిందితుడి అరెస్ట్

గోపాలపట్నం: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురానికి చెందిన ఎ.అవినాష్ కేటరింగ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. అతను కొంతమంది వ్యక్తులతో కలిసి ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లు చేస్తున్నాడు. ఈ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి అవినాష్‌ను అదుపులోకి తీసుకుని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో అవినాష్‌పై కేసు నమోదు చేశారు. ఈ కేసులో మరికొంత మందికి సంబంధం ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వారు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సమాచారం.

చిట్టి మెదళ్లు.. పెద్ద ఆలోచనలు

ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శన

అరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టింది. 11 మండలాల నుంచి ఎంపిక చేసిన 33 ప్రాజెక్టులను ఇక్కడ ప్రదర్శించారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ ప్రదర్శనను ప్రారంభించి విద్యార్థులు చేసిన నృత్యాలను తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జిల్లా విద్యార్థులు విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. డీఈవో ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రవేత్తలుగా మారడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు బాటలు వేస్తాయన్నారు. గత నెల 30న పాఠశాల స్థాయిలో, 31న మండల స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేసి విజేతలతో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమమైన ఆరు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశామన్నారు. ఇందులో విద్యార్థుల వ్యక్తిగత ప్రదర్శనలు రెండు, గ్రూపు ప్రదర్శనలు రెండు, ఉపాధ్యాయులు రూపొందించిన రెండు ప్రాజెక్టులు ఉన్నాయని వెల్లడించారు. విద్యాశాఖాధికారులు, హెచ్‌ఎంలు గంగా భవాని, పైడిరాజు, కృష్ణకుమార్, రవి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు ఇవే..

వ్యక్తిగత విభాగంలో పెందుర్తి ఉన్నత పాఠశాల నుంచి మల్టీ పర్పస్ అగ్రికల్చర్ రోబోట్, శ్రీకృష్ణాపురం గురుకుల నుంచి యూజ్ ఆఫ్ మ్యాథమెటికల్ మోడలింగ్ ఫర్ స్వచ్ఛ భారత్, గ్రూపు విభాగంలో నడుపూరు ఉన్నత పాఠశాల నుంచి యాంటీ స్లీప్ అలారం, మేహాద్రి గెడ్డ బాలికల గురుకుల నుంచి ఆటోమేటిక్ సేఫ్టీ మానిటరింగ్ అండ్ ప్రివెన్సివ్ సిస్టమ్, ఉపాధ్యాయ విభాగంలో శ్రీకృష్ణాపురం గురుకులం నుంచి ఆటోమేటిక్ ట్రైన్ కొలిజన్ సిస్టమ్, అగనంపూడి ఉన్నత పాఠశాల నుంచి కన్జర్వేషన్ ఆఫ్ ఫుడ్ అండ్ వాటర్ ప్రాజెక్టులు ఎంపికయ్యాయి.


ప్రదర్శనలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, డీఈవో ప్రేమ్‌కుమార్

రెప్ప వేస్తే.. చెప్పేస్తుంది



నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయిని లక్ష్మి ఆధ్వర్యంలో తరుణ్, యశస్విని ఈ ప్రాజెక్టును తయారు చేశారు. ఇది రోడ్డు ప్రమాదాల నివారణకు ఉపయోగపడుతుంది. ఈ పరికరం వల్ల వాహనం నడుపుతున్నప్పుడు కొంచెం సేపు రెప్ప వేసినా పెద్ద బీప్ శబ్దం వస్తుంది. దీంతో వాహనచోదకుడు వెంటనే అప్రమత్తమవుతాడు. దీనివల్ల ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడవచ్చని విద్యార్థులు తెలిపారు.

ఇలా చేస్తే రైళ్లు ఢీకొట్టవు



ఈ ప్రాజెక్టును చినగదిలి మండలం శ్రీకృష్ణాపురం గురుకులం భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు బి.సీతారాం రూపొందించారు. బహుళ రైళ్ల ఢీకొని ప్రమాదాలు జరగకుండా నివారించడానికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. రైలు కూడళ్లలో పట్టాలు దాటుతున్నప్పుడు రైళ్లు ఒకదానికొకటి ఢీకొనకుండా ఈ వ్యవస్థ ద్వారా జాగ్రత్తలు తీసుకోవచ్చని ఉపాధ్యాయులు తెలిపారు.

రైతులకు మేలు చేసేలా..



ఈ ప్రాజెక్టును పెందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బి.ఎం.పట్నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థి కె.పూర్ణచంద్ర తయారు చేశాడు. ఇది వ్యవసాయంలో ఉపయోగపడుతుంది. చిన్న కమతాల్లో సైతం దుక్కి దున్నడానికి, విత్తనాలు చల్లడానికి, మొక్కలకు అవసరమైన మేర నీటిని సరఫరా చేయడానికి వినియోగించవచ్చు. నీరు, విత్తనాలు వృథా కాకుండా రైతుకు ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థి తెలిపాడు.

నిర్మాణ రంగంలో గణితం



ఈ ప్రాజెక్టును చినగదిలి మండలం శ్రీకృష్ణాపురం గురుకులం గణిత ఉపాధ్యాయుడు బి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థి పి.ఆకాష్ తయారు చేశాడు. దీని ద్వారా ఎక్కడైనా తక్కువ ఖర్చుతో, తక్కువ స్థలంలో నిర్మాణం చేపట్టవచ్చు. ఎక్కువ మంది ప్రజలు నివసించే విధంగా గణిత శాస్త్రాన్ని ఉపయోగించి నిర్మాణం చేపట్టవచ్చని విద్యార్థి వివరించాడు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ



మేఘాద్రిగెడ్డ బాలికల గురుకులం ఉపాధ్యాయిని కె.రమణమ్మ పర్యవేక్షణలో విద్యార్థులు లోహిత, హిమబిందు ఈ ప్రాజెక్ట్‌ను తయారు చేశారు. దీని ద్వారా ఫార్మాస్యూటికల్ పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవచ్చని విద్యార్థులు తెలిపారు. ఇది సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచుతుంది. గ్యాస్ లీకేజీ, ఫైర్ అలారమ్, టెంపరేచర్ మానిటర్లను అప్రమత్తం చేస్తుంది.

నేవీడే విన్యాసాలు



- వేడుకలకు సర్వం సిద్ధం
- సీటింగ్‌కు ప్రత్యేక పాస్‌లు మంజూరు
- బీచ్‌రోడ్డులో పటిష్ట భద్రత
- వీక్షకులకు ఉపయుక్తంగా ఎల్‌ఈడీల ఏర్పాటు


కూర్చునేందుకు వీలుగా ఇసుకలో వేసిన గ్రీన్‌మ్యాట్

ఏయూక్యాంపస్: నావికాదళ విన్యాసాలకు బీచ్ రోడ్డు సర్వాంగ సుందరంగా సిద్ధమవుతోంది. శనివారం సాయంత్రం విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా జరగనున్న నావికాదళ విన్యాసాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారీ సంఖ్యలో సందర్శకులు వచ్చినా వీక్షించేందుకు వీలుగా నేవీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆర్‌కే బీచ్ నుంచి పోలీస్‌మెస్ వరకు తీరంలో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సందర్శకులు సాగర తీరంలో కూర్చుని ఎల్‌ఈడీ తెరలపై వేడుకలు వీక్షించవచ్చు. ప్రధాన వేదికకు రెండు వైపులా సీటింగ్, ఇసుక తిన్నెలపై సైతం కుర్చీలు వేసి సీటింగ్ సదుపాయం కల్పించారు. వీటికి ప్రత్యేక పాస్‌లను జారీ చేశారు. సిల్వర్‌స్పూన్ రెస్టారెంట్ నుంచి పోలీస్ మెస్ వరకు ఉన్న ఇసుక తిన్నెలచుట్టూ కేవలం ఫెన్సింగ్ వేశారు. నావికా విన్యాసాలు ప్రారంభమయ్యే సమయానికి గంట ముందుగానే ప్రజలు ప్రాంగణానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నావికా విన్యాసాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు హాజరవుతున్న నేపథ్యంలో పోలీసులు, జీవీఎంసీ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. శనివారం మధ్యాహ్నం నుంచి బీచ్‌రోడ్డులోకి వాహనాలను అనుమతించరు. వీక్షకులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైదానాలలో తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి. సాయంత్రం 4.40 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ విన్యాసాలు జరుగుతాయి.

ప్రత్యేక ఆకర్షణగా లేజర్ షో

కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న లేజర్ షో, డ్రోన్ షోలు మరింత కొత్తదనాన్ని తీసుకువస్తున్నాయి. నావికాదళ సిబ్బంది సంగీత బృందం బీటింగ్ రిట్రీట్, తుపాకులతో చేసే కవాతు వారి క్రమశిక్షణ, ఏకాగ్రతలకు ప్రతీకగా నిలుస్తాయి. పెద్దసంఖ్యలో నావికాదళ ఉన్నతాధికారులు, సిబ్బందితో పాటు, నగరవాసులు ఈ విన్యాసాలను తిలకించడానికి రానున్నారు. గతంలో కంటే విస్తృత స్థాయిలో దీనికోసం నావికాదళం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. నేవీ విన్యాసాల్లో యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, ఫైటర్ జెట్‌లు, సబ్‌మెరైన్‌లు భాగం కానున్నాయి. నావికాదళానికి వెన్నెముకగా నిలిచే మెరైన్ కమాండోల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. భారత నావికాదళ సిబ్బంది ధైర్యం, సాహసాలను ప్రజలకు కళ్లకు కట్టినట్టు చూపే విధంగా ఈ కార్యక్రమం జరగనుంది. ఇప్పటికే జరిగిన రెండు నమూనా విన్యాసాలు విజయవంతమయ్యాయి.


వీక్షకుల గ్యాలరీలో ఏర్పాటు చేసిన కుర్చీలు

నూనెగింజల సాగు దత్తత గ్రామాలుగా వెంకుపాలెం, దిబ్బపాలెం

కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ

తుమ్మపాల: సమగ్ర యాజమాన్య చర్యల ద్వారా నూనె గింజలలో అధిక దిగుబడి సాధించవచ్చని బీసీటీ–కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్రా అన్నారు. జాతీయ నూనె గింజల భద్రత పథకంలో భాగంగా మండలంలో వెంకుపాలెం, దిబ్బపాలెం గ్రామాల్లోని వేరుశనగ, పొద్దుతిరుగుడు, నువ్వు పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. రబీలో వీటి ఉత్పత్తికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రామారావు మాట్లాడు తూ కొద్దిపాటి మెల కువల ద్వారా నూనె గింజల పంటలలో నాణ్యమైన దిగుబడులు సాధించడంతో పాటు నికర ఆదా యం పెంచుకోవచ్చ న్నారు. నూనె శాతం పెరగడానికి ముఖ్య మైన గంధకాన్ని, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వాడడం ఉత్తమమని అన్నారు. రెండు గ్రామాలను నూనె గింజల ఆదర్శ గ్రామాలుగా గుర్తించబడ్డాయన్నారు. కేంద్ర ప్రభు త్వం ప్రోత్సాహంతో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం కార్యాచరణను అమలు చేస్తూ అధిక శాతం నువ్వు గింజల సాగుకు కృషి చేస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావుతోపాటు రైతులను ఆయన అభినందించా రు. అంతకుముందు 46 మంది రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ దాడి గణేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు మోహన్, రామకృష్ణ, ప్రకృతి వ్యవసాయ కార్యకర్త లు కృష్ణవేణి, సుధారాణి, అభ్యుదయ రైతులు సాంబశివరావు, కన్నంనాయుడు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త శైలజ, ఏడీ రామారావు

గంజాయి నిందితులకు 10 ఏళ్ల జైలు శిక్ష

ఇద్దరికి రూ.లక్ష చొప్పున జరిమానా

చోడవరం రూరల్: గంజాయి అక్రమ రవాణా కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరు నిందితులకు ఒక్కొక్కరికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ చోడవరం తొమ్మిదో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.రత్నకుమార్ తీర్పు చెప్పారు. కోర్టు వర్గాలు అందించిన సమాచాచం మేరకు... అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీ మండలం బొండం గ్రామానికి చెందిన నిందితులు పంచాడి సునీల్ కుమార్, గొల్లిరి వీరాస్వామి చెరొక బ్యాగులో గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. 2013 డిసెంబర్ నెల 3వ తేదీన వీరిద్దరూ ఆర్టీసీ బస్సు(ఏపీ 28జడ్ 5834లో ప్రయాణిస్తుండగా ముందుగా అందిన సమాచారం మేరకు అదే జిల్లా అనంతగిరి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫసర్ ఎల్.రామకృష్ణ తమ సిబ్బందితో తనిఖీ నిర్వహించగా, నిందితులు పట్టుబడ్డారు. వీరి నుంచి రెండు బ్యాగుల్లో పదేసి కిలోల గంజాయితో దొరికారు. వీరి నుంచి 20 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులపై నేరారోపణ అభియోగ పత్రాన్ని ఎస్ఐ రామకృష్ణ న్యాయస్థానంలో దాఖలు చేయడంతో పాటు సాక్షులను కోర్టు ముందుంచారు. నిందితులపై మోపిన అభియోగం సాక్ష్యాధారాలతో రుజువు కావడంతో శుక్రవారం న్యాయమూర్తి రత్నకుమార్ వారికి కారాగార శిక్ష, జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తన తీర్పులో వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరఫున న్యాయవాది ఉగ్గిన వెంకటరావు తన వాదనలు వినిపించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, అప్పటి ఎస్ఐ రామకృష్ణ, న్యాయవాది వెంకటరావు, సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచి, నిందితులపై మోపిన అభియోగం రుజువయ్యేలా కృషి చేసిన కోర్టు మానిటరింగ్ సిబ్బందిని అభినందించారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తూ మృత్యుఒడిలోకి

భీమడోలు: తిరుపతి దర్శనానికి వెళ్లి వస్తుండగా.. లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో కారు డ్రైవర్ మృతి చెందాడు. జాతీయ రహదారిపై ఏలూరు జిల్లా భీమడోలు మండలం అంబర్‌పేట పంచాయతీ శివారు కొండ్రెడ్డినగర్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో గుబ్బ తిరుపతి స్వామి(56) మృతి చెందాడు. ఓ మహిళకు తీవ్ర గాయాలు కాగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం గుంటపల్లి గ్రామానికి చెందిన గుబ్బ తిరుపతి స్వామి కారులో గంటా గోవింద్ కుటుంబానికి చెందిన అమలావతి, అలేఖ్య, లక్ష్మీ, సందీప్, అవినాష్ ఈనెల ఒకటిన తిరుపతి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కొండ్రెడ్డినగర్ వద్ద ట్రాలీ లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. ఇది గమనించని కారు డ్రైవర్ గుబ్బ తిరుపతి స్వామి అతివేగంగా వెనుక నుంచి లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయాలైన తిరుపతి స్వామి(56)ని హైవే అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాదంలో తీవ్రగాయాలైన గంటా అమలావతిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిలిగిన ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి అల్లుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన గుబ్బ తిరుపతి స్వామి


ప్రమాదంలో తీవ్రంగా దెబ్బతిన్న కారు

విశాఖలో బౌండరీల మోత

- రెచ్చిపోయిన శుభమ్
- ఇరగదీసిన అశుతోష్, సంజీత్
- జమ్ముకశ్మీర్‌పై ఛత్తీస్‌గఢ్ విజయకేతనం

విశాఖ స్పోర్ట్స్: విజయ్ హజారే ట్రోఫీ గ్రూప్ డీ పోటీల్లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో బౌండరీల మోత మోగింది. జమ్ముకశ్మీర్, ఛత్తీస్‌గఢ్ జట్లు భారీ స్కోర్లు చేయగా.. ముగ్గురు బ్యాటర్లు సెంచరీలు చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఛత్తీస్‌గఢ్ చేతిలో టాస్ ఓడి జమ్ము కశ్మీర్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 50 ఓవర్లలో మరో 15 బంతులు ఉండగానే ఆలౌట్ అయి 337 పరుగులు చేసింది. ఓపెనర్ శుభమ్ ఖజూరియా 159 పరుగులతో జట్టు భారీ స్కోర్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. తొలి వికెట్‌కు ఓపెనర్ వివ్రాంత్ శర్మ(42)తో కలిసి 100 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. 20 ఫోర్లు, 5 సిక్సర్లు బాదిన శుభమ్ అనూహ్యంగా రనౌట్ అయ్యాడు. కెప్టెన్ డోగ్రా నాలుగు పరుగులకే పెవిలియన్‌కు చేరగా, అజాజ్ 27, అబిద్ 30, నాజిర్ 32 పరుగులతో రాణించారు. రవికిరణ్ మూడు, గగన్‌దీప్, హర్ష రెండేసి వికెట్లు తీశారు. 338 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఛత్తీస్‌గఢ్ మరో 9 బంతులు ఉండగానే విజయాన్ని అందుకుంది. ఓపెనర్ అశుతోష్ 127, వన్‌డౌన్‌లో వచ్చిన సంజీత్ 128 పరుగులు చేశారు. వీరి జోడి రెండో వికెట్‌కు ఏకంగా 228 పరుగులు జోడించింది. యాదవ్ 51 పరుగులు చేశాడు.

జైలులో 'సెల్'చల్

- కలకలం రేపుతున్న సెల్‌ఫోన్ల లభ్యత
- జైలుకు ఎలా చేరుతున్నాయో ప్రశ్నార్థం
- తలలు పట్టుకుంటున్న అధికారులు
- జైల్ సిబ్బందిపై అనుమానం


జైల్ నర్మదా బ్యారక్‌లో అధికారులకు దొరికిన సెల్ ఫోన్

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్‌లు కలకలం రేపుతున్నాయి. జైల్ బేరక్‌లలో వరుసగా సెల్‌ఫోన్‌లు బయటపడుతుండటంతో అధికారులు కంగుతింటున్నారు. నిషేధించిన వస్తువులు జైల్ లోపలకు ఎలా చేరుతున్నాయో అంతుచిక్కక కొత్తగా వచ్చిన అధికారులు తలలు పట్టుకొంటున్నారు. శుక్రవారం ఓ సెల్ ఫోన్ లభించింది. నాలుగు రోజుల కిందట రెండు సెల్ ఫోన్‌లు దొరికిన విషయం తెలిసిందే. నాలుగు రోజుల వ్యవధిలోనే రెండు బేరక్‌లలో మూడు సెల్ ఫోన్‌లు దొరకడంతో ఇంకెన్ని సెల్ ఫోన్‌లు ఎక్కడెక్కడ ఉన్నాయో అని అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. తనిఖీల్లో భాగంగా శుక్రవారం నర్మదా బేరక్‌ను పరిశీలించినట్లు జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు తెలిపారు. ఈ తనిఖీలలో ఆ బేరక్ స్టోర్ రూం మెట్ల కింద గచ్చులో చేసిన రంధ్రంలో ఓ డబుల్ సిమ్ సెల్ ఫోన్ దొరికినట్లు తెలిపారు. దాన్ని స్వాధీనం చేసుకొని ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. గత నెల 31న రెండు సెల్ ఫోన్‌లు, ప్రస్తుతం దొరికిన సెల్ ఫోన్లపై ఆరిలోవ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ఎవరు వినిగిస్తున్నారు..?

విశాఖ కేంద్ర కారాగారంలో ఏ ఖైదీలు సెల్ ఫోన్‌లు వినియోగిస్తున్నారో అనే దానిపై జైల్ అధికారులు, ఆరిలోవ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇంత కట్టుదిట్టమైన రక్షణ వలయంను ఛేదించుకుని సెల్ ఫోన్‌లను జైల్ లోపలకు ఎవరు అందిస్తున్నారో అనేది అంతుచిక్కడంలేదంటూ అధికారులు అంటున్నారు. జైల్‌సిబ్బంది ప్రమేయంతోనే సెల్ ఫోన్‌లు లోపలకు వెలుతున్నాయని భావిస్తున్నారు. గత ఏడాది డిశంబరు 31న పెన్నా బేరక్‌లో రెండు సెల్ ఫోన్‌లు, ఒక పవర్ బ్యాంక్, ఒక కీ బోర్డు, రెండు కేబుళ్లు బయటపడ్డాయి. వాటిని మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడు, రౌడీ షీటర్ కోలా హేమంతకుమార్, మరో రౌడీషీటర్ రాజేష్ వినియోగించినవిగా జైల్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వారిరువురిపైనా సెల్ ఫోన్‌లు వినియోగిస్తున్నట్లు అనుమానం ఉన్నట్లు పేర్కొన్నామని సూపరింటెండెంట్ మహేష్‌బాబు తెలిపారు. శుక్రవారం బయటపడిన సెల్ ఫోన్ ఎవరు ఉపయోగించారో, దాన్ని ఎవరు లోపలకు సరఫరా చేశారో తేలాల్సి ఉంది.